# వెయ్యి ఎకరాల సాగుభూమిని ముంచకుండ ప్రొద్దుటూరుకు తాగు నీరు ఇవ్వలేమా?

ప్రొద్దుటూరు పట్టణానికి తాగు నీరు అందించడానికి చిన్నశెట్టిపల్లె, పర్లపాడు తదితర గ్రామాలకు చెందిన వెయ్యి ఎకరాల సారవంతమైన సాగుభూమిని ముంచనక్కరలేదని, భూసేకరణ అవసరంలేని ప్రత్యామ్నాయాలు ఉన్నాయని ఎంతచెప్పినా వినకుండ మొండిగా కొనసాగుతున్న ప్రభుత్వ వైఖరిని ఖండించవలసినదిగా ప్రజలను కోరుతున్నాం.

"ఎవరెన్ని అన్నా కాలవతవ్వేదే" అని తిరస్కారంగా మాట్లాడుతున్న ఎంఎల్ఏ వైఖరిని కూడా ఖండించవలసినదిగా ప్రజలను కోరుతున్నాం. ప్రజాప్రతినిధులుండేది ప్రజల అవసరాలకు, అభిప్రాయాలకు ప్రాతినిధ్యం వహించడానికి. ప్రజల నెత్తినెక్కి సవారి చేయడానికి కాదు. ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలవల్ల నష్టపోయే ప్రజలు సహేతుకమైన అభ్యంతరం తెలిపితే ఆ అభ్యంతరానికి సహేతుకంగా జవాబు చెప్పాలి. అంతేతప్ప "ఎవరేమన్నా చేసేది చేసేదే" అనడం అహంకారం అనిపించుకుంటుంది, ప్రజాస్వామ్య వైఖరి అనిపించుకోదు.

ప్రొద్దుటూరుకు తాగునీరు అవసరమే, దాంట్లో సందేహం లేదు. కానీ గ్రామీణ ప్రజల వ్యవసాయాన్ని కాపాడడమూ అవసరమే. దాంట్లోనూ సందేహంగానీ విభేదంగానీ ఉండరాదు. పల్లెప్రజలకు నష్టం కలిగించకుండ ప్రొద్దుటూరుకు తాగునీరియ్యడం సాధ్యమే కాకపోతే అప్పుడేం చేయాలన్నది వేరే విషయం. ప్రత్యామ్నాయం ఉన్నప్పుడు వాటిని లెక్కలోకే తీసుకోమనడం ఏం న్యాయం?

నగరాలకూ పట్టణాలకూ తాగునీళ్లెప్పుడూ పైప్‌లైన్ల ద్వారా తీసుకొస్తారు. హైదరాబాద్‌కు తాగునీరు సింగూరు, అక్కంపల్లి రిజర్వాయర్ల నుండి పైప్‌లైన్ల ద్వారా వస్తుంది. విశాఖపట్నంకు తాగునీరు మేఘాద్రి గెడ్డ నుండి, తాటిపూడి రాజర్వాయర్ నుండి పైప్‌లైన్ ద్వారా వస్తుంది. బెంగుళూరుకు తిప్పగొంబీన హళ్లి చెరువు నుండి కృష్ణ రాజ సాగర్ రిజర్వాయర్ నుండి తాగునీరు పైప్‌లైన్ ద్వారా వస్తుంది. ఈ సంగతులు ప్రొద్దుటూరు పట్టణంలోగానీ పరిసర గ్రామాలలో గానీ నివసించే రైతులకు, కూలీలకు తెలియకపోవచ్చు. నాయకులకు ఆనగరాలలో ఆస్తులున్నాయి, వ్యాపారాలున్నాయి. తాగునీరు ఎట్లా ఇస్తున్నారో తెలుసుకోలేకపోయారా? ప్రొద్దుటూరు ఎంత మహానగరమని హైదరాబాదుకు, బెంగుళూరుకు పనికొచ్చిన పైప్‌లైన్ సరఫరా ప్రొద్దుటూరుకు పనికి రాకుండ పోయింది?

వట్టణాలకు తాగునీరు పైప్‌లైన్ ద్వారా అందియ్యడానికి కారణం ఉంది. తాగునీటికి సరఫరా చేసే నీరు శుభ్రంగా ఉండడం అవసరం. మార్గమధ్యంలో నీటిచౌర్యాన్ని అదుపు చేయడం అవసరం. తాగునీటికి కేటాయించే నీటి పరిమాణం భారీగా ఉండదు. కాబట్టి (ప్రొద్దుటూరుకు ఇచ్చేది 1 టిఎంసి మాత్రమే) పైప్‌లైన్ల వాడకంలో అసౌకర్యమేమీ ఉండదు. సాగునీటి కాలవలు మార్గమధ్యంలో డిస్ట్రిబ్యూటరీల ద్వారా పొలాలకు నీళ్ళిచ్చుకుంటూ పోతాయి. అందువల్ల సాగునీటి సరఫరా కాలవల రూపంలో ఉండక తప్పదు. పట్టణానికి తాగు నీరు ఇచ్చే వ్యవస్థ నేరుగా పట్టణాలకే వస్తుంది. దారిలో నీటి చౌర్యం జరగకుండ చూసుకోవడం అవసరం. నీటిలో అశుభ్రం చేరకుండ చూసుకోవడమూ అవసరం. కాబట్టి ఏరకంగా-

> ప్రొద్దుటూరు పట్టణానికి తాగు నీరు ఇవ్వడానికి ఈ ప్రజలంతా త్యాగం చేయక తప్పదని వరదరాజుల రెడ్డి గారు అంటున్నారు. 25 సంవత్సరాలుగా ప్రొద్దుటూరు ఎంఎల్ఏ గా ఉన్న వరదరాజుల రెడ్డి గారు ఆ ఊరి అభివృద్ధికైనా నియోజక వర్గం అభివృద్ధికైనా ఎప్పుడైనా ఏమైనా త్యాగం చేశారేమో చెప్తారా? ఎంఎల్ఏ కాకముందు సాధారణ రైతు కుటుంబీకులుగా ఉన్నవారు వందల కోట్ల ఆస్తిపరులయ్యారు. కలప నుండి రియల్ ఎస్టేట్ దాకా ఏ వనరులనూ వదిలి పెట్టలేదు. ఎప్పుడైనా ఏ అభివృద్ధి పథకానికైనా ఏమైనా త్యాగం చేయవలసి వస్తే వారి ప్రత్యర్థులో సామాన్య ప్రజలో త్యాగం చేయాలనే తప్ప వారెప్పుడూ ఒక సెంటు భూమి త్యాగం చేయలేదు. చేయకపోగా 'అభివృద్ధి' లాభాలన్నీ వారివే, వారికి అయినవారివే.

చూసినా కాలవ కంటే పైప్‌లైనే ఉచితమైనది. పైగా కాలవ అలైన్‌మెంట్ ఒకరకంగా ఉంచారా అంటే అదీ లేదు. మొదట ఇంజనీర్లు వేసిన నమూనా కూడ వ్యవసాయ భూములను ముంచేదే అయినా నివాసాల పక్కనుండి పోదు, ప్రొద్దుటూరు పట్టణంలో ఎవరినీ నిర్వాసితులను చేయదు. కానీ కాంట్రాక్టర్ చేపట్టిన రెండవ అలైన్‌మెంట్‌లో ప్రొద్దుటూరులో దాదాపు భాగం అయిపోయిన పెద్దిశెట్టిపల్లెలోని శ్రీగురుకాలనీ, ఎస్‌పినగర్ కాలనీలలో **750** ఇళ్ల ప్లాట్లకు పైగా మునుగుతాయి. ఎన్నడో ప్లాట్లు కొనుక్కున్న ప్రజలు ఇప్పుడు ఇళ్లు కట్టుకోవడానికి సిద్ధమవుతున్నారు. ఆ అవకాశాన్ని వాళ్ళు కోల్పోతారు. రెండు శ్మశానాలూ ఒక కబరస్తాన్ (ముస్లింల శ్మశానం) కూడ మునుగుతాయి.

మునిగే వ్యవసాయ భూములకైనా ఇళ్ల ప్లాట్ల కైనా నష్టపరిహారం ఇస్తాము కదా అంటారేమో. ప్రత్యామ్నాయాలు లెక్కపెట్టకుండ బలవంతంగా భూములు స్వాధీనం చేసుకోవడం ఎందుకు, నష్టపరిహారం ఇవ్వడం ఎందుకు? అయినా ఇచ్చిన ఆ నష్టపరిహారాన్ని రైతులు ఏం చేసుకోవాలి? వాళ్లకు వ్యవసాయం తప్ప వేరే ఏ వ్యాపకమూ తెలీదు. వ్యవసాయానికి మళ్లీ భూమి కొనుక్కోవాలంటే ఉన్న ఊరిలోనైనా పక్క ఊరిలోనైనా ఎకరానికిచ్చిన నష్టపరిహారంతో ఎకరంలో నాలుగవ భాగం కూడ రాదు. దూరం పోయి కొనుక్కుంటే ఇల్లిక్కడ, సేద్యం అక్కడ అవుతుంది. ఇక ప్రొద్దుటూరు పరిసరాలలో ఇళ్ల స్థలాలు మునిగేవారు వేరే ఎక్కడ కొనుక్కోవాలి? ప్రభుత్వం ఇచ్చే నష్టపరిహారంతో ఇప్పటి ధరలకు ప్రొద్దుటూరు శివారులో ఎక్కడా ఇళ్లస్థలాలు దొరకవు. అందుకే ఎంఎల్‌ఏ కుటుంబానికి చెందిన రాధానగర్, అమృత నగర్ కాలనీలలో మాకు ప్రత్యామ్నాయంగా ప్లాట్లిస్తారా అని అడుగుతున్నారు. 'కాలవ తవ్వేదే', అంటున్న వరదరాజులు రెడ్డిగారు వారందరికీ ఉచితంగా ప్లాట్లిస్తారా?

వేరే రెండు ప్రత్యామ్నాయాలు కూడా సూచించడం జరిగింది. మైలవరం ప్రాజెక్టులోని లోటును భర్తీ చేయడం కోసమని ఎస్‌ఆర్‌బీసి వరద కాలవ ప్రతిపాదించబడింది. అది దాదాపు పూర్తయింది. దాని నుండి **1** టిఎంసి ప్రొద్దుటూరు తాగు నీటి అవసరాలకెందుకు కేటాయించకూడదు? ఇప్పుడు తవ్వుతున్న కుందుకాలవ కూడ వరదనీటి కాలవే. కాబట్టి అదయినా ఇదయినా వరద నీటి ప్రాజక్టే. కానీ ఆ ప్రత్యామ్నాయం ఎంచుకున్నట్టయితే ఎవరికీ ఏ నష్టం ఉండదు.

చివరి ప్రత్యామ్నాయం గండికోటనుండి నీటి తరలింపు. గాలేరు నగరి ప్రాజెక్టును శరవేగంగా పూర్తిచేయడానికి పనులు జరిగిపోతున్నాయి. దానికి భూములు ఇవ్వడం కోసం పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ సామర్థ్యం పెంచి ఇతర ప్రాంతాల వారి చేత తిట్లు తినడమూ జరిగింది. అది పూర్తయిన వెంటనే గండికోట రిజర్వయర్ నుండి **1** టిఎంసి నీరు ప్రొద్దుటూరు అవసరాల కోసం పెన్నా నదిలోకి వదలడం కష్టమా?

అసలు ప్రొద్దుటూరుకు నీటి ఎద్దడి ఎందుకు వచ్చింది? పెన్న నదిలో నీళ్లెందుకు లేకుండ పోయాయి? ప్రొద్దుటూరు ప్రజల మీద ప్రేమ ఒలకబోస్తున్న నాయకులు జవాబు చెప్తారా? పెన్నా నదిలోని ఇసుకను నిరంతరాయంగా తరలిస్తున్న వ్యాపారమే దీనికి కారణం కాదా? ప్రొద్దుటూరు మీద ప్రేమే ఉంటే ఆ ఇసుక వ్యాపారం ఎన్నడో నిలిపి ఉండేవారు కాదా? నదిలోని ఇసుకంతా తీసేసి నీళ్ళు నిలవకుండ చేసి లక్షలాది రూపాయల లాభం ఆర్జించి ఇప్పుడు అయ్యో పాపం ప్రొద్దుటూరు ప్రజలకు తాగునీరు తక్కువయిందే అని వెయ్యి ఎకరాల సాగుభూమిని ముంచి కుందునది నీళ్ళు తీసుకొచ్చే ప్రాజక్టు తయారు చేశారు.

కాగితం మీద ఎవరి పేర్లున్నా ప్రాజెక్టు కాంట్రాక్టు ప్రొద్దుటూరు ఎంఎల్‌ఏ కుమారునిదే అనేది జగమెరిగిన సత్యం. అధికార యంత్రాంగం వారి జేబులో ఉంది కాబట్టి అంతమొండిగా ఏమార్పుకూ ఒప్పుకోం అని దబాయిస్తున్నారు. సమస్య సృష్టిలోనూ వారిదే లాభం, దాని పరిష్కారం లోనూ వారిదే లాభం. అన్నిరకాలుగా నష్టపోవలసింది ప్రజలు.

ఈ కుతర్కాన్ని తిరస్కరించమని ప్రజలకు విజ్ఞప్తి చేస్తూ, ప్రొద్దుటూరు తాగునీటి కోసం ఏ ముంపూ ఉండని ప్రత్యామ్నాయాలను అనుసరించవలసినదిగా ప్రభుత్వాన్ని డిమాండ్ చేద్దాం రమ్మని ఆహ్వానం పలుకుతున్నాం.
ప్రతిపక్ష పార్టీలు కూడ, ప్రొద్దుటూరు పట్టణ ప్రజలే కాదు, గ్రామీణ ప్రజలు కూడ పౌరులేననీ వారు కూడ ఓటర్లేననీ గుర్తించి ఈ ఆందోళనలో భాగం కావాలని పిలుపునిస్తున్నాం.

ప్రొద్దుటూరు
30మే2008

**మానవ హక్కుల వేదిక**
**HRF**, కడప జిల్లా శాఖ

SRUJANA @ 9985226946